క్లుప్తంగా

దుర్గమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే వెలంపల్లి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు సోమవారం గాయత్రిదేవి అలంకారంలో దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావును ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం అందచేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లను మంత్రి కొట్టు సత్యనారాయణతో కలిసి ఆయన పరిశీలించారు. మీడియా సమావేశంలోనూ పాల్గొన్న వెలంపల్లి శ్రీనివాసరావు ఉత్సవాల ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు.

జీడీసీ అకౌంటెంట్‌గా మంజుబాబు



లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వ దంత వైద్య కళాశాల అడ్మినిస్ట్రేషన్ విభాగం అకౌంటెంట్ (కార్యాలయ సూపరింటెండెంట్)గా జి. మంజుబాబు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో సోమవారం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్రదేవ్‌కు జాయినింగ్ రిపోర్టు అందచేశారు. ఇప్పటి వరకూ మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రిలో అకౌంటెంట్‌గా పనిచేశారు. గతంలో విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో దీర్ఘకాలం పాటు పనిచేసి, మంచి వర్కర్‌గా గుర్తింపు పొందారు. అనంతరం బదిలీపై పెనమలూరు పీహెచ్‌సీకి వెళ్లారు. అక్కడి నుంచి మచిలీపట్నం పదోన్నతిపై వెళ్లిన మంజుబాబు పరస్పర బదిలీలో విజయవాడ ప్రభుత్వ దంత వైద్య కళాశాలకు వచ్చారు. ఆయనను కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారి మేరీరత్నం, హెడ్‌నర్సు శివలీల తదితరులు కలిసి అభినందనలు తెలిపారు.

శానిటరీ కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన



భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం 44వ డివిజన్ పరిధిలోని లేబర్‌కాలనీలో గల మున్సిపల్ హైస్కూల్ వెనుక భాగాన ఉన్న ఖాళీ స్థలంలో శానిటరీ కార్యాలయం నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి సోమవారం కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో శానిటేషన్ పనులను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలుగా పారిశుద్ధ్య కార్మికుల కోసం ఇక్కడ శానిటరీ కార్యాలయాన్ని నిర్మిస్తున్నామని చెప్పారు. డివిజన్‌లోని కొండ ప్రాంతంలో ఎక్కడైతే మెట్లు, డ్రెయిన్లు లేవో పరిశీలించి ఆయా ప్రాంతాల్లో వాటిని నిర్మిస్తున్నామని తెలిపారు. అలాగే కొండ ఎగువ భాగంలో మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు సహకారంతో డివిజన్ సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైలవరపు దుర్గారావు మాట్లాడుతూ మౌలిక సదుపాయాల కల్పన కోసం చర్యలు తీసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర సహాయ కార్యదర్శి పెద్ది రాజారావు, శానిటరీ ఇనస్పెక్టర్ వేణుగోపాల్, మేస్త్రి ధనరాజ్, సచివాలయ సెక్రటరీలు హర్షిత, రమేష్, కాంట్రాక్టర్ గంగిరెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

వేడుకగా బ్రహ్మోత్సవాలు

విజయవాడ కల్చరల్: కంచికామకోటి పీఠం, శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. సోమవారం నాటి కార్యక్రమాలు ఉదయం భేరీ పూజతో ప్రారంభమయ్యాయి. భేరీ తాండవం, ఆలయ బలి నిర్వహణ, గ్రామబలిదానం, అఖిల గద్య, పద్య పూర్వక ధ్వజారోహణం, ధ్వజదేవర్చన, నవ కుంభారోహణ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు.

విశేష అలంకారాల్లో అమ్మవారు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ పరిధిలోని పలు ఆలయాల్లో దసరా ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. మహాలక్ష్మీ అమ్మవారు బాలాత్రిపురసుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కళ్యాణ మండపంలో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారిని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి దర్శించుకున్నారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు దేవస్థానం ఉచితంగా ప్రసాదాలను పంపిణీ చేసింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావులతో పాటు కమిటీ సభ్యులు పొట్నూరి దుర్గాప్రసాద్, కొరగంజి భాస్కరరావు, పోతిన బేసుకంతేశ్వరుడు, మజ్జి ఈశ్వరరావులు పాల్గొన్నారు. భీమనవారిపేటలోని విజయ దుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో అమ్మవారు గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు నిర్వహించగా, ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ నిర్వహించగా పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

లలితాంబికా పీఠంలో అమ్మవారిని బాలా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. అమ్మవారి ఉత్సవ మూర్తికి విశేష అభిషేకాలు చేశారు. అమ్మవారికి పీఠాధీశ్వరి శివలీల మాతాశ్రీ విశేష పూజలు నిర్వహించగా, పీఠం కన్వీనర్ రాంపిళ్ల చైతన్య ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కొత్తపేట ఆంజనేయవాగు సెంటర్‌లోని వీరాంజనేయ స్వామి వారి దేవస్థాన ప్రాంగణంలోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి వారి ఆలయంలో దసరా మహోత్సవాలను నిర్వహిస్తున్నారు. రెండో రోజున అమ్మవారిని గాయత్రిదేవిగా అలంకరించారు. ఆలయ అర్చకులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ పర్యవేక్షణలో ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన యాగంలో ఉభయదాతలు వరికుప్పల విజయ్, లక్ష్మీ శిరీష దంపతులు పాల్గొన్నారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకోగా, ఆలయ ఈవో రావూరి వెంకటేశ్వరరావు, ఛైర్మన్ నందిపాటి శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. భవానీపురం కరకట్ట సమీపంలోని దుర్గా భవాని దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల్లో సోమవారం అమ్మవారు గాయత్రిదేవిగా దర్శించుకున్నారు. గణపతి, లక్ష్మీ గణపతి, నవగ్రహ, చండీ, సుదర్శన హోమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అమ్మవారి ఉత్సవ మూర్తి వద్ద సామూహిక కుంకుమార్చన నిర్వహించగా పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. దేవస్థాన అర్చకులు దంటు భవానీశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష అలంకరణ, పూజలు నిర్వహించారు.



కరకట్ట వద్ద గాయత్రిదేవిగా అమ్మవారు



కేదారేశ్వరపేటలో గాయత్రిదేవిగా దర్శనమిచ్చిన శివకాళేశ్వరిదేవి



భీమనవారిపేటలో గాయత్రిదేవిగా అమ్మవారు



లలితాంబికా పీఠంలో బాలాత్రిపుర సుందరిదేవిగా...

వేదమాతగా అమ్మవార్లు దర్శనం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలో వివిధ ఆలయాల్లో కొలువై ఉన్న అమ్మవార్లు వేదమాత గాయత్రీదేవిగా, బాలాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వన్‌టౌన్‌లోని ఆయా ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ఉభయదాతలు, భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహిచారు. అన్ని ఆలయాల్లోనూ పెద్ద ఎత్తున కుంకుమార్చనలు చేశారు. ఆయా ఆలయాల్లోని ప్రధాన మూర్తులకు ప్రత్యేక అర్చనలు చేశారు.

భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం)లో భ్రమరాంబ అమ్మవారు బాలాత్రిపురసుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఖడ్గమాల ఇతర కుంకుమార్చనలు, చండీ హోమం, రుద్రాభిషేకం చేశారు. సాయంత్రం అమ్మవారికి పంచహారతులు కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణవీధిలో కొలువై ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో పద్మావతి అమ్మవారు సంతానలక్ష్మీగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి సహస్రనామార్చన నిర్వహించారు. స్వామి వారికి సైతం విశేష పూజలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి ఘంటసాల శ్రీనివాసు పర్యవేక్షించారు. చదును మహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయ దాతలు అమ్మవారికి కుంకుమార్చనలు, ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని అష్టలక్ష్మీలు ఉపాలయంలో అమ్మవారు సంతానలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శేషయ్యవీధిలో కొలువై ఉన్న కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీకృష్ణ భగవానునికి, సూర్యనారాయణ మూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు గోకవరపు మురళీకృష్ణ పర్యవేక్షించారు.

గాయత్రి దేవిగా దర్శనం

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కేదారేశ్వర పేటలో కొలువుదీరిన శివకాళేశ్వరి దేవి సోమవారం గాయత్రి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవదేవిని దర్శించుకునేందుకు తెల్లవారు జామునుంచే పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు అమ్మవారికి కొబ్బరి కాయలు కొట్టి కర్పూర హారతులు పట్టారు. అధిక సంఖ్యలో వచ్చిన మహిళలు, భవానీలు, అయ్యప్ప దీక్షాదారులు, ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు.



సంతాన లక్ష్మీగా పద్మావతి అమ్మవారు దర్శనం



బాలాత్రిపురసుందరీదేవిగా భ్రమరాంబ అమ్మవారు దర్శనం



వీరాంజనేయ స్వామి వారి ఆలయంలో యాగం చేస్తున్న భక్తులు



పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు



చిట్టినగర్‌లో బాలా త్రిపురసుందరిదేవిగా



గాయత్రీదేవిగా చదును మహాలక్ష్మీ అమ్మవారు

ఆరోగ్యాంధ్రప్రదేశే సీఎం జగన్ లక్ష్యం

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

వించిపేట(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం అని, ఆ దిశగా ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు.

స్థానిక 55వ డివిజన్, కంసాలీపేటలోని తమ్మిన పోతరాజు స్కూల్‌లో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ గతంలో ఎవ్వరూ చేయని విధంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. 171వ సచివాల పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో 6 వేల మంది వైద్య సేవలను వినియోగించుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఈ వైద్య శిబిరాల ద్వారా ఎంతో మంది రోగులు పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు.

వివిధ విభాగాల వైద్యులు పాల్గొని పలు రకాల రక్త పరీక్షలు నిర్వహించి ప్రాథమికంగా వ్యాధి నిర్ధారణ గుర్తించి తగిన చికిత్స అందిస్తారని చెప్పారు.



శిబిరంలో వైద్య సేవలు పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

ప్రతిపక్షాలు విమర్శలు మానుకోవాలి....

రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తుంటే ప్రతిపక్షాలు చూసి ఓర్వలేక విమర్శలకు చేయడం సరికాదన్నారు. ప్రజలకు నేరుగా వారి ఇంటి వద్దే సంక్షేమ పథకాలు అందిస్తు అవ్వాతాతల మన్ననలు పొందుతున్న వలంటీర్లపై ప్రతిపక్షాలు తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని సూచించారు. అవినీతికి పాల్పడితే ఎంతటివారికైన సంకెళ్లు తప్పవన్నారు. అరెస్టుపై రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లితే సహించేది లేదని హెచ్చరించారు. పవన్ కళ్యాణ్ చంద్రబాబు ప్యాకేజీ కోసం అయనపై కపట ప్రేమ నటిస్తున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, 55వ డివిజన్ కార్పొరేటర్ శిరంశెట్టి పూర్ణచంద్రరావు, జిల్లా వైద్యశాఖ అధికారిణి సుహాసిని, సిఎంహెచ్ఓ రత్నావళి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

అమ్మ అనుగ్రహం ఉంటే అన్నీ ఉన్నట్లే

ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి

భవానీపురం(విజయవాడపశ్చిమ): భక్తులపాలిట కొంగు బంగారమైన కనకదుర్గమ్మ అమ్మవారి అనుగ్రహం ఉంటే అన్నీ ఉన్నట్లేనని, వారి ఇంట అన్నీ శుభాలే జరుగుతాయని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. దసరా మహోత్సవాలలో రెండవ రోజైన సోమవారం 47వ డివిజన్ పరిధిలోని కుండల మార్కెట్ వద్దగల శ్రీగంగా దుర్గ మారెమ్మ విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో గాయత్రి దేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకున్నారు.



గంగా దుర్గ మారెమ్మ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో పూజలో పాల్గొన్న వెలంపల్లి, భాగ్యలక్ష్మి

అనంతరం దేవస్థానంలో అమ్మవారి సన్నిధిలో నిర్వహించిన కుంకుమ పూజలో వారు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం నిర్వాహకురాలు, దేవీ ఉపాసకురాలు తమ్మిన నవీన మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా అమ్మవారిని నమ్ముకుని ఆరాధ్య దైవంగా కొలుస్తున్నామని చెప్పారు.

ముఖ్యంగా ఈ దేవాలయ పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే వెలంపల్లి దేవదాయ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో సీజీఎఫ్ నుంచి రూ.20 లక్షలు మంజూరు చేసిన విషయం మరిచిపోలేమన్నారు. తనతోపాటు అమ్మవారి భక్తులు ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో 48వ డివిజన్ కార్పొరేటర్ అత్తలూరి ఆదిలక్ష్మి, నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ శీరం వెంకట్రావు, సింహాచలం దేవస్థానం ధర్మకర్త కూరాకుల నాగ, వైఎస్సార్ సీపీ నాయకులు అత్తలూరి పెదబాబు, కె.కాశేశ్వరరాజు, అమరబాబు, దుద్దుకూరి శివ, నాగోతి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

పటమట(విజయవాడతూర్పు): దసరా ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. శనీశ్వర స్వామి ఆలయం, ఫ్లై ఓవర్ బ్రిడ్జి దిగువన, నగరపాలక సంస్థ కార్యాలయం ముందు ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన టెంట్ల వద్ద పారిశుద్ధ్య నిర్వహణ విధానాన్ని పరిశీలించారు. దసరా ఉత్సవాల్లో పారిశుద్య సిబ్బంది మూడు షిఫ్టుల్లో నిరంతరం విధులు నిర్వహించాలని, మరుగుదొడ్లు, ఆలయ పరిసర ప్రాంతాలు, రోడ్లు, క్యూ లైన్ లు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఉత్సవాల్లో వీఎంసీ నుంచి విధులు నిర్వహించే సిబ్బందికి సకాలంలో అల్పాహారం, భోజనాలను అందించాలని లేనిపక్షంలో సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తాగు నీరు పంపిణీ పాయింట్‌లను పరిశీలించి నిరంతరం క్యూలైన్లలో ఉన్న భక్తులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. హోల్డింగ్ ఏరియా, బస్టాండు దగ్గర ఉన్న తాత్కాలిక మొబైల్ టాయిలెట్లను పరిశీలించి మరుగుదొడ్లను పరిశుభ్రంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన టాయిలెట్లకు నిరంతర నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఉత్సవాలకు మంగళవారం నుంచి అధిక మొత్తంలో భక్తులు వచ్చే అవకాశం ఉందని, ఆయా ప్రాంతాల్లో విధులను నిర్దేశించిన వారంతా నిరంతర పర్యవేక్షణలో సిబ్బందిని అప్రమత్తం చేస్తూ భక్తులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని కోరారు. పర్యటనలో సబ్ కలెక్టర్ అదితి సింగ్, అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, చీఫ్ ఇంజినీర్ యం.ప్రభాకర్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, జోనల్ కమిషనర్ - 1 డాక్టర్ రవిచంద్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, హెల్త్ ఆఫీసర్-3 ఇక్బాల్ హుస్సేన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



దుర్గాఘాట్ వద్ద పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సబ్ కలెక్టర్ అదితి సింగ్

ఆకట్టుకున్న దశావతార నృత్యరూపకం

భవానీపురం(విజయవాడపశ్చిమ): దసరా మహోత్సవాలను పురస్కరించుకుని భవానీపురం క్రాంబ్వే రోడ్‌లోని సెయింట్ జాన్స్ పాఠశాలలో సోమవారం నిర్వహించిన సంబరాలలో భాగంగా చిన్నారులు ప్రదర్శించిన దశావతారాలు నృత్యరూపకం చూపరులను ఆకట్టుకుంది. అమ్మవారి దశావతారాల వేషధారణలో చిన్నారులు అభినయించిన తీరు హర్షధ్వానాలను అందుకుంది. ఈ వేడుకలకు ముఖ్యఅతిథులుగా సెయింట్ జాన్స్ పాఠశాల సెక్రటరీ/కరస్పాండెంట్ టి.సుమన్ త్యాగరాజ్, ప్రెసిడెంట్ టి.మోనిక సుమన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెడు మీద మంచి ఎప్పుడూ గెలుస్తుందన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ నీతి, నిజాయితీలతో జీవించాలని, అప్పుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని చెప్పారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే మంచి నడవడికను అలవరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల అకడమిక్ ఆడిటర్ కేవీ కల్యాణి, ప్రిన్సిపాల్ సీహెచ్ సుచరిత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



వైభవంగా దసరా ఉత్సవాలు

ఇంద్రకీలాద్రిపై దసరా మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు అయిన సోమవారం పెద్ద సంఖ్యలో భక్తులు దుర్గమ్మను దర్శించుకున్నారు. భక్తులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించారు. ఎక్కడా ఏ విధమైన ఇబ్బందులు లేకుండా కట్టుదట్టమైన చర్యలు తీసుకుంటున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







దుర్గమ్మ సన్నిధిలో రిటైర్డ్ జస్టిస్ బి.శివశంకర్

